






మదినిండా చంద్రన్న - ప్రచారంలో భాగంగా ఓ కుటుంబంతో చంద్రబాబు - చంటిపాపకు నామకరణం చేస్తూ..

స్పీచు మారింది.. స్పీడు పెరిగింది



యువత సమావేశంలో మాట్లాడుతున్న చంద్రబాబు

మహిళలకు ధైర్యాన్నిస్తూ.. యువతకు భరోసానిస్తూ.. వైసీపీ అరాచకాలను ఎండగడుతూ..

కుప్పంలో ముగిసిన చంద్రబాబు రెండు రోజుల పర్యటన

చిత్తూరు, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): రెండు రోజుల కుప్పం పర్యటనలో చంద్రబాబు స్పీచ్ మారింది. రొటీన్‌గా కాకుండా ప్రతి అంశాన్ని స్పష్టంగా, అర్థమయ్యేలా, ఆలోచింపజేసేలా ప్రసంగించారు. టీడీపీ అధికారంలోకి వస్తే మహిళల జోలికి రావాలంటే భయపడేలా చేస్తానని ధైర్యాన్నిచ్చారు. యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తానని చెప్పడంతోనే సరిపెట్టకుండా.. ఎలా చేస్తామనేదీ వివరించారు. వైసీపీ నాయకుల తీరుతో రాష్ట్ర వ్యాప్తంగా ఆత్మహత్యలు చేసుకున్న కుటుంబాల గురించి ప్రస్తావించి.. తమ భవిష్యత్తుపై ప్రజలు ఆలోచింపజేసేలా చేశారు. తిరుపతి డాక్టర్ సునీత, వైజాగ్‌లో ఎన్‌ఆర్‌ఐ భూములు కొల్లయిన తీరును ప్రస్తావించి వైసీపీ అరాచకాలను ఎండగట్టారు. భవిష్యత్తులో వైసీపీ అధికారంలోకి వస్తే ఎంత దారుణ పరిస్థితులు ఉంటాయనేది వివరించారు. ఇక, గతంలోలాగా ఆలస్యం కాకుండా ప్రతి ప్రోగ్రాం కూడా షెడ్యూల్ ప్రకారమే జరిగింది. దీంతో చంద్రబాబు స్పీడు పెంచారని శ్రేణులు చెప్పుకొంటున్నారు. ఇక, తొలిరోజు మహిళలు రెండు గంటల ముందే సమావేశానికి వచ్చి చంద్రబాబు కోసం ఎదురుచూశారు. ఆయన వచ్చిన తర్వాత ఒకటిన్నర గంట సమావేశం జరిగినా ఎవరూ కదల్లేదు. ఆయన ప్రసంగాన్ని ఆసక్తిగా విన్నారు. బహిరంగ సభకూ భారీగా జనం హాజరయ్యారు. చంద్రబాబు ప్రసంగం సాగినంత సేపు ఉత్సాహంగా కేకలు వేస్తూ కనిపించారు. ఇక, చంద్రబాబు పర్యటనలో చిత్తూరు ఎంపీ అభ్యర్థి దగ్గుమళ్ల ప్రసాదరావును, పార్లమెంటు పార్టీ అధ్యక్షుడు సీఆర్ రాజన్‌ను కుప్పం ప్రజలకు పరిచయం చేశారు. ప్రతి సమావేశంలోనూ వారితో మాట్లాడించారు. మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులును అక్రమంగా జైలులో పెట్టిన విషయాన్ని గుర్తుచేస్తూ ఆవేదన చెందారు. ముస్లింలతో కలిసి సోమవారం సాయంత్రం ఇఫ్తార్ విందులో పాల్గొన్న చంద్రబాబు.. రాష్ట్రానికి పట్టిన దరిద్రాన్ని దూరం చేయమని దువా చేశారు. రెండో రోజు యువతతో ముఖాముఖి నిర్వహించారు.

ద్రవిడ వర్సిటీని ప్రక్షాళన చేస్తాం

- అన్ని కోర్సులను తిరిగి ప్రవేశపెడతాం
- 20 లక్షల ఉద్యోగాలిస్తాం
- నిరుద్యోగులకు రూ.3 వేల భృతి అందిస్తాం
- యువతతో ముఖాముఖిలో చంద్రబాబు
- యువశక్తిని నిర్వీర్యం చేసిన జగన్‌ను సాగనంపాలని పిలుపు



సమావేశంలో పాల్గొన్న యువత

కుప్పం/గుడుపల్లె, మార్చి 26: 'కుప్పంలోని ద్రవిడ విశ్వవిద్యాలయాన్ని వైసీపీ ప్రభుత్వం భ్రష్టుపట్టించింది. స్థాపన లక్ష్యాలను గాలికొదిలింది. పలు కోర్సులను రద్దు చేసింది. విద్యార్థులు చదువుకునే అవకాశం లేకుండా చేస్తోంది. మేము అధికారంలోకి రాగానే వర్సిటీని ప్రక్షాళన చేస్తాం. రద్దయిన అన్ని కోర్సులను తిరిగి ప్రవేశపెడతాం' అని చంద్రబాబు అన్నారు. కుప్పం గ్రానైట్‌ను ఐదేళ్లుగా వైసీపీ నేతలు కేజీఎఫ్ తరహాలో తవ్వి దోచుకున్నారని చంద్రబాబు ఆరోపించారు. 'గనులు, ఇసుక, బెరైటీస్ లాంటి ఖనిజ సంపదను దోచేశారు. వైసీపీ తిరిగి అధికారంలోకి వస్తే మన ఇంటిమీద మనకు హక్కులుండవు. అందుకే ఈ దుర్మార్గ ప్రభుత్వాన్ని భూస్థాపితం చేయాలి' అంటూ పిలుపునిచ్చారు. కుప్పంలో రెస్కోను కొనసాగిస్తామని హామీ ఇచ్చారు. కుప్పంలోని టీడీపీ కార్యాలయ ఆవరణలో మంగళవారం నియోజకవర్గంలోని యువతతో చంద్రబాబు ముఖాముఖి నిర్వహించారు.

కిరణ్‌కుమార్, రామకుప్పం: తటస్థ ఓటర్లను ఎవరూ కలవడం లేదు. వారిని కలిసి ఓట్లు అభ్యర్థిస్తే టీడీపీ ఘన విజయం సాధిస్తుంది.

చంద్రబాబు: యువత రాజకీయాల్లో ముందుకు రావాలి. మీరే తటస్థులను కలిసి ఓట్లు అభ్యర్థించి పార్టీ విజయానికి కృషి చేయండి. మిమ్మల్ని ఎలా పైకి తీసుకురావాలో నేను ఆలోచిస్తా.

మురుగేష్, రామకుప్పం: ఒక్క అవకాశమంటూ జగన్ గద్దెనెక్కి కక్షసాధింపులకు పాల్పడుతున్నారు. అసెంబ్లీ వేదికగా ప్రతిపక్షాలను.. వారి కుటుంబీకులను తిట్టిస్తున్నారు. అలాంటి నాయకుడు మాకు అవసరం లేదు.

చంద్రబాబు: అడ్డదారిలో వచ్చిన వ్యక్తి సీఎం అయితే ఇలాగే ఉంటుంది. అసెంబ్లీ వేదికగా నన్నే వేధించారు. ఇది కౌరవ సభని, గౌరవ సభ చేసి వస్తానని ఆనాడే చెప్పా. యువత నా వెంట ఉంటే వారి బంగారు భవిష్యత్తుకు బాటలు వేస్తా. రాజకీయాలను ప్రక్షాళన చేసి, అసెంబ్లీలో ప్రజాసమస్యలపై చర్చ జరిగేలా చూస్తా.

ఆనంద్, మల్లానూరు: ఈ ప్రభుత్వంలో యువత గంజాయి, డ్రగ్స్‌కు బానిసలవుతున్నారు. టీడీపీ అధికారంలోకి రాగానే వీటి నివారణకు ఏంచేస్తారు?

చంద్రబాబు: మనం యువత మత్తుకు బానిసలు కాకుండా వారికి నైపుణ్యాభివృద్ధిలో శిక్షణ ఇచ్చి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తాం. ఉపాధి కల్పించడం ద్వారా వారు పెడదోవ పట్టకుండా, కుటుంబాలకు భారం కాకుండా, బాసటగా నిలిచేలా చర్యలు తీసుకుంటాం. డ్రగ్స్‌పై ఉక్కుపాదం మోపుతాం.

బాలకృష్ణ, చందం: ఎంఏ ఇంగ్లీష్ చేసిన నేను ఆపై కోర్సులకోసం ద్రవిడ వర్సిటీకి వెళితే చాలా కోర్సులు తీసేసి ఉన్నారు. ఈ వర్సిటీపై శ్రద్ధ తీసుకుంటారా?

చంద్రబాబు: ద్రవిడ వర్సిటీ స్థాపన లక్ష్యాలైన భాష, సంస్కృతి, సాహిత్య పరిరక్షణకు మొదటి ప్రాధాన్యమిస్తాం. జిల్లాలోని అన్ని డిగ్రీ కళాశాలలను ద్రవిడ వర్సిటీకి అనుసంధానిస్తాం. రద్దు చేసిన కోర్సులను పునరుద్ధరిస్తాం. ఇంజనీరింగ్ కళాశాలను ఏర్పాటుచేసి సెంట్రల్ వర్సిటీగా తీర్చిదిద్దుతాం.

టీడీపీ వాళ్లమని ఏ పథకాలూ ఇవ్వలేదు

- ఇంటింటి ప్రచారంలో బాధిత కుటుంబాల ఆవేదన



ఇంటింటి ప్రచారంలో చంద్రబాబుకు సమస్యలు వివరిస్తున్న స్థానికులు

కుప్పం/శాంతిపురం, మార్చి 26: 'సార్, మేము టీడీపీ వాళ్లమని ఈ వైసీపీ వాళ్లు ఐదేళ్లుగా మాకు ఏ పథకమూ అందివ్వడం లేదు. 20 ఏళ్ల కిందట మీరిచ్చిన కాలనీ ఇళ్లలోనే నివాసం ఉంటున్నాం. వైసీపీ ప్రభుత్వం మాకెన్ని ఇబ్బందులు పెట్టినా పార్టీ మారలేదు. ఈసారి కుప్పాన్ని ఓడిస్తామని వాళ్లు గొప్పలు చెబుతున్నారు. వారెన్ని కుట్రలు చేసినా మీకు లక్ష మెజారిటీ రావడం ఖాయం' అంటూ కుప్పం బాబు నగర్‌కు చెందిన టీడీపీ నేత గౌరప్ప కుటుంబీకులు చంద్రబాబుతో అన్నారు. మంగళవారం ఆయన ఈ ప్రాంతంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. గతం గుర్తు చేసుకుందాం, బాబు రుణం తీర్చుకుందాం అన్న కరపత్రాలను మహిళలకు అందించారు. వారి సమస్యలు వింటూ ముందుకు కదిలారు. పలువురు కుటుంబ సభ్యులు తమ ఇళ్ల పరిస్థితిని ఆయనకు వివరించారు. అందరి సమస్యలూ విన్న ఆయన.. అధికారంలోకి రాగానే పరిష్కరించుకుందామంటూ భరోసా ఇచ్చారు. కుప్పంలో రాతి కార్మికుల కోసం వంద ఎకరాల్లో రాయితీతో కూడిన జీవనోపాధిని కల్పిస్తామన్నారు. అర్హులైన పేదలకు ఇంటి పట్టాలతో పాటు పక్కా గృహాలు నిర్మిస్తామన్నారు. ముత్తుమారెమ్మ ఆలయంలో పూజలు నిర్వహించారు.



నీళ్లులేని హంద్రీ నీవా కాలువలో కబడ్డీ ఆడుతున్న టీడీపీ శ్రేణులు..



కాలువలో నడిచి వస్తున్న చంద్రబాబు

పలమనేరు, పుత్తూరులో నేడు చంద్రబాబు ప్రజాగళం

చిత్తూరు కలెక్టరేట్, మార్చి 26: టీడీపీ అధినేత చంద్రబాబు ప్రజాగళం పేరిట బుధవారం పలమనేరు, పుత్తూరులో ప్రచార సభలు నిర్వహించనున్నారు. ఉదయం 10.15 గంటలకు కుప్పంలోని పీఈఎస్ మెడికల్ కాలేజ్ హెలిప్యాడ్ నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరి 10.50 గంటలకు పలమనేరులోని రాజేష్ ఎస్టేట్‌లో ఏర్పాటుచేసిన హెలిప్యాడ్‌లో దిగుతారు. జౌళి వీధిలో ఏర్పాటుచేసిన ప్రజాగళం కార్యక్రమంలో పాల్గొంటారు. మధ్యాహ్నం 1.50 గంటలకు హెలికాప్టర్‌లో బయలుదేరి తిరుపతి జిల్లా పుత్తూరు మున్సిపాలిటీలోని శ్రీ వేంకటేశ్వర పెరుమాళ్‌లో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌లో దిగుతారు. అక్కడినుంచి రోడ్డు మార్గాన బయలుదేరి కార్వేటినగరం రోడ్డు, కాపువీధి జంక్షన్‌లో మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు జరిగే కార్యక్రమంలో పాల్గొంటారు. అనంతరం అన్నమయ్య జిల్లా మదనపల్లెకు హెలికాప్టర్‌లో బయలుదేరి వెళ్లనున్నారు.

కుప్పం నేలపై నడిస్తే అరిగిపోతావా?

- నీళ్లే ఇవ్వకుండా సెట్టింగులతో డ్రామాలా?
- సీఎం జగన్‌పై చంద్రబాబు విమర్శ
- అధికారంలోకి వచ్చిన ఏడాదిలో హంద్రీ-నీవాకు నీళ్లిస్తామని హామీ

రామకుప్పం/వి.కోట, మార్చి 26: కుప్పం నేలపై నడిస్తే అరిగిపోతావని రెండు హెలిప్యాడ్లు ఏర్పాటు చేసుకుని తిరిగావంటూ సీఎం జగన్‌పై టీడీపీ అధినేత చంద్రబాబు విమర్శ చేశారు. రామకుప్పం మండలం రాజుపేట వద్ద హంద్రీ నీవా కాలువను మంగళవారం సాయంత్రం పరిశీలించిన ఆయన మీడియాతో మాట్లాడారు. 'నేను సీఎంగా ఉండి కుప్పం బ్రాంచ్ కెనాల్ పనులు 90 శాతం చేపట్టి వి.కోట వరకు నీళ్లు తెచ్చా. వైసీపీ అధికారంలోకి వచ్చిన ఐదేళ్లలో మిగిలిన పది శాతం పనులు పూర్తి చేయకుండా సినిమా సెట్టింగులతో కుప్పానికి నీళ్లిచ్చామని ప్రజలను మభ్యపెట్టారు. నీతి, నిజాయితీకి మారుపేరైన కుప్పం ప్రజలను నీటి డ్రామాతో మోసగించడానికి మనసెలా వచ్చింది' అంటూ సీఎంను ప్రశ్నించారు. ఇలాంటి డ్రామాలు కుప్పం ప్రజలు నమ్మరన్నారు. తాము అధికారంలోకి వచ్చిన ఏడాదిలో కుప్పానికి హంద్రీ, నీవా ద్వారా పూర్తి స్థాయిలో నీరిచ్చి అన్ని చెరువులను నింపుతామని హామీ ఇచ్చారు. 'నాడు తాను అమలు చేసిన ఇజ్రాయెల్ తరహా బిందుసేద్యం ప్రాజెక్టును.. తండ్రి (వైఎస్) ఆపేశారు. నేడు కొడుకు (జగన్) వచ్చి కుప్పాన్ని సర్వ నాశనం చేయడమే కాకుండా, సంపదను కొల్లగొట్టారు' అంటూ పోల్చి చెప్పారు. 'నేను కుప్పం కంటే ముందే పులివెందులకే నీళ్లిచ్చా. అది నీకు.. నాకు ఉన్న తేడా. నీతో పాటు నీ అనుచరవర్గం కుప్పంలో దౌర్జన్యాలు, అక్రమాలు చేస్తున్నారనడానికి నిదర్శనం గుండిశెట్టిపల్లె సమీపంలోని బసవేశ్వరస్వామి భూములను కొట్టేయాలని చూడటమే. ఇలాంటివి ఎప్పటికీ జరగనివ్వను' అని చంద్రబాబు స్పష్టంచేశారు. గుడుపల్లె మండలం యామిగానిపల్లె వద్ద రూ.364 కోట్లతో.. శాంతిపురం మండలం మాదనపల్లె వద్ద రూ.170 కోట్లతో రిజర్వాయర్ల నిర్మాణానికి పనులు మంజూరు చేశామన్నారు. ఇప్పుడు వీళ్లు మంజూరు చేసినట్లు చెప్పుకోవడానికి సిగ్గులేదా అని వైసీపీ ప్రభుత్వాన్ని నిలదీశారు. కాగా, రాజుపేట వద్ద 15-20 అడుగుల లోతున్న హంద్రీ నీవా కాలువలోకి చంద్రబాబు దిగారు. దిగేటప్పుడు.. మళ్లీ ఎక్కేటప్పుడు సెక్యూరిటీ సిబ్బంది, నాయకులు సాయం అందించేందుకు ప్రయత్నించినా ఆయన అంగీకరించలేదు. 74 ఏళ్ల వయసులోనూ ఆయన ఉత్సాహంగా కాలువలోకి దిగి పరిశీలించారు.



రాజుపేట వద్ద గేటు కింద చూస్తున్న చంద్రబాబు

తండ్రి మృతి దుఃఖాన్ని దిగమింగి..!

- టెన్త్ పరీక్ష రాసిన విద్యార్థి



ఐరాల, మార్చి 26: తన ఉన్నతికి బాటలు పరుస్తున్న తండ్రి విగతజీవుడిగా మారారు. తండ్రి మృతదేహాన్ని చూసి కుమిలిపోయిన విద్యార్థి.. దుఃఖాన్ని దిగమింగి టెన్త్ పరీక్ష రాశారు. ఈ ఘటన మంగళవారం ఐరాలలో చోటుచేసుకుంది. వీఎస్ అగ్రహారానికి చెందిన చలపతి(43) కూలి పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. ఇతడికి భార్య, కుమారుడు సంతోష్, కుమార్తె నిత్య ఉన్నారు. చలపతికి ఆరోగ్యం క్షీణించి మంగళవారం మృతి చెందారు. తండ్రి మరణంతో తల్లడిల్లిన సంతోష్.. ఆయన కలలు నెరవేర్చేందుకని వేదనను దిగమింగారు. ఐరాల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జీవశాస్త్రం టెన్త్ పరీక్ష రాశారు. ఆ తర్వాత ఇంటికి చేరుకుని తండ్రి అంత్యక్రియలు పూర్తి చేశాడు. ఈ విషాద ఘటన స్థానికులను కంటతడి పెట్టించింది.

టెన్త్ పరీక్ష రాసిన కుమార్తెను తీసుకొస్తూ..!

- ట్రాక్టర్‌పై నుంచి జారిపడి తండ్రి మృతి



మహేంద్ర (ఫైల్‌ఫొటో)

గంగాధరనెల్లూరు, మార్చి 26: పదో తరగతి పరీక్ష రాసిన కుమార్తెను ఇంటికి తీసుకొచ్చే క్రమంలో జరిగిన ప్రమాదంలో మహేంద్రన్(45) మృతిచెందారు. గంగాధరనెల్లూరు మండలం వింజం పంచాయతీ వి.లక్ష్మీరెడ్డిపల్లె దళితవాడకు చెందిన మహేంద్రన్(45) డ్రైవర్‌గా పనిచేస్తున్నారు. ఇతడికి భార్య మలర్, కుమార్తెలు హరిత, మమత, చంద్రప్రియ, కుమారుడు ప్రేమ్‌కుమార్ ఉన్నారు. ఈయన రెండో కుమార్తె మంగళవారం గంగాధరనెల్లూరు హైస్కూల్లో పదో తరగతి పరీక్ష రాశారు. ఆమెను ఇంటికి తీసుకెళ్లేందుకు రోడ్డుపై ఉన్నారు. సిద్దేశ్వరకొండకు చెందిన భాస్కర్ చిత్తూరు నుంచి ట్రాక్టర్‌తో స్వగ్రామానికి వస్తుండగా ఆపి.. మహేంద్రన్‌తో పాటు పరీక్షకు హాజరైన పలువురు విద్యార్థులు ఎక్కారు. వీరిలో ట్రాక్టర్ ఇంజిన్ పైన డ్రైవర్ పక్కన మహేంద్రన్ కూర్చోగా, విద్యార్థులందరూ ట్రాలీలో ఎక్కారు. ద్వారకానగరం వద్ద మహేంద్రన్ కాలుజారి తారురోడ్డుపై పడ్డారు. ఆయన తలకు తీవ్రగాయంతో పాటు ట్రాలీ టైరు తలపై ఎక్కిదిగడంతో అక్కడికక్కడే మృతిచెందారు. ట్రాలీలో ఉన్న ఆయన కుమార్తె మమతతో పాటు మిగిలిన విద్యార్థులు కేకలు పెట్టారు. ప్రమాదంపై మృతుడి భార్య మలర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ శంకర్ తెలిపారు.

సీఎం ఫొటోల్లేని సర్టిఫికెట్లు వచ్చాయ్

చిత్తూరు కలెక్టరేట్, మార్చి 26: సీఎం జగన్ ఫొటోలేని సర్టిఫికెట్లు చిత్తూరుకు వచ్చాయి. 86వేల సర్టిఫికెట్లను తెప్పించి సచివాలయాలకు పంపిణీ చేపట్టారు. గతంలో ఖాళీ సర్టిఫికెట్లపై ఒక పక్క ప్రభుత్వ లోగో, మరో వైపు సీఎం ఫొటో ఉండేది. సీఎం ఫొటో ఉండటంతో ఎన్నికల కోడ్ వల్ల సర్టిఫికెట్ల జారీకి బ్రేక్ పడిందని విద్యార్థులు, రైతులు ఇబ్బంది పడుతున్నారు. దీనిపై 'సీఎం ఫొటోతో తంటా' పేరిట మంగళవారం ఆంధ్రజ్యోతిలో వార్త ప్రచురితమైంది. దీనికి ప్రత్యామ్నాయంగా సీఎం ఫొటో స్థానంలోనూ ప్రభుత్వ లోగోను ముద్రించిన సర్టిఫికెట్లు అందుబాటులోకి వచ్చాయి. ప్రజలకు ఇబ్బంది లేకుండా చర్యలు చేపట్టినట్లు డీఆర్వో పుల్లయ్య తెలిపారు.



సీఎం జగన్ బొమ్మ స్థానంలో ప్రభుత్వ లోగో

రంజాన్ వేళలు

ఇఫ్తార్ (బుధవారం) : సా. 6.29
సహరి (గురువారం) : ఉ. 4.52

కష్టపడే వారికే ప్రాధాన్యం

● యూనిట్ ఇన్‌చార్జులతో చంద్రబాబు సమీక్ష



కుప్పం రూరల్, మార్చి 26: కష్టపడే వారికి పార్టీలో ప్రాధాన్యం ఉంటుందని చంద్రబాబు స్పష్టంచేశారు. కుప్పం నియోజకవర్గంలోని నాలుగు మండలాల యూనిట్ ఇన్‌చార్జులతో మంగళవారం రాత్రి ఆయన పార్టీ కార్యాలయంలో సమీక్షించారు. బాబు ష్యూరిటీ, భవిష్యత్తు గ్యారెంటీ, గతం గుర్తు చేసుకుందాం, బాబు రుణం తీర్చుకుందాం వంటి కార్యక్రమాలను గ్రామాల వారీగా ఎలా నిర్వహిస్తున్నారని ఆరా తీశారు. తక్కువ గ్రాఫ్ ఉన్న బూత్‌లకు సంబంధించి సభ్యులను మందలించారు. సమన్వయం చేసుకోని క్లస్టర్ ఇన్‌చార్జులపై అసహనం వ్యక్తం చేశారు. ఈ 50 రోజులు కష్టపడి పనిచేసి ప్రతి ఇంటికి వెళ్లి మనం గతంలో చేసిన అభివృద్ధిని, చేయబోయే పనులను, సంక్షేమాన్ని ప్రజలకు వివరించాలన్నారు. ఇప్పుడు ఎవరెంత కష్టపడతారో, రానున్న రోజుల్లో వారికే ప్రాధాన్యం ఉంటుందన్న విషయాన్ని గుర్తు పెట్టుకోవాలన్నారు.

వేర్వేరు వాహనాల్లో రూ.7.77లక్షలు స్వాధీనం

గుడిపాల, మార్చి 26: గుడిపాల మండలంలోని తమిళనాడు సరిహద్దు ప్రాంతమైన ముత్తరాజ్‌కుప్పం వద్ద వాహనాల తనిఖీలు చేపట్టారు. చెన్నై నుంచి వస్తున్న వాహనంలో రూ.5,76,000 నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ శ్రీనివాసరావు మంగళవారం తెలిపారు. చెన్నై నుంచి కర్ణాటక రాష్ట్రం ముళ్‌బాగల్‌కు వెళ్తున్న మినీ లారీలో బంగాళదుంపల లోడును తనిఖీ చేయగా, ఎటువంటి బిల్లులు లేని నగదును గుర్తించి, సీజ్ చేశామన్నారు. ఈ దాడుల్లో ఏఎస్‌ఐ ఎత్తిరాజులు, సిబ్బంది పాల్గొన్నారు.

● చిత్తూరు-వేలూరులోని గొల్లమడుగు చెక్‌పోస్టు వద్ద వేలూరు నుంచి నెల్లూరుకు చేపల లోడుతో వెళ్తున్న వాహనంలో రూ.2,01,280 నగదును సీజ్ చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. ఎలాంటి ఆధారాలు లేకుండా నగదు, బంగారం, వెండి వస్తువులను తరలిస్తే సీజ్‌చేస్తామని హెచ్చరించారు. ఈ దాడుల్లో ఎన్నికల ప్రత్యేక అధికారి గణపతి ఉన్నారు. మంగళవారం ఒక్కరోజే రూ.7,77,280 పట్టుబడినట్లు ఎస్‌ఐ తెలిపారు.



మారని రంగు

శ్రీరంగరాజపురం: ఎస్‌ఆర్‌పురం మండలం పుల్లూరు పంచాయతీలోని తాగునీటి ట్యాంకుకు వైసీపీ రంగులున్నాయి. ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినా వాటిని మార్చలేదు.



పెనుమూరు: పెనుమూరు మండలం శాతంబాకం సచివాలయ పరిధిలోని చిన్నరాజుపల్లిలో నూతనంగా నిర్మించిన వాటర్ ట్యాంకుకు వైసీపీ రంగులు ఉన్నాయి. వీటిని మార్చకపోవడంపై ప్రతిపక్షాలు అభ్యంతరం చెబుతున్నాయి.

తిరుమలలో హీరో రామ్‌చరణ్



శ్రీవారి దర్శనార్థం హీరో రామ్‌చరణ్ భార్య ఉపాసన,కుమార్తె క్లీంకారతో కలిసి మంగళవారం సాయంత్రం తిరుమలకు వచ్చారు. ఫీనిక్స్(శ్రీవేంకటేశ్వర నిలయం) అతిథిగృహానికి రాత్రి 7.30 గంటలకు చేరుకున్న వారికి స్థానిక అభిమానులు పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. రాంచరణ్ దంపతులు బుధవారం ఉదయం శ్రీవారిని దర్శించుకోనున్నారు.
- తిరుమల,ఆంధ్రజ్యోతి

పొలంలో అగ్ని ప్రమాదం: రూ.లక్ష నష్టం

సోమల, మార్చి 26: వల్లిగట్ల సమీపంలో అగ్ని ప్రమాదం జరిగి రూ.లక్ష మేర నష్టం జరిగిందని బాధితుడు ఉలవల శివమణి తెలిపారు. మంగళవారం మధ్యాహ్నం బీడు పొలంలో మంటలు చెలరేగాయి. ఆ మంటలు శివమణి టమోటా పొలం వైపు వ్యాపించి.. టమోటా మొక్కలు, డ్రిప్ పైపులు, పరికరాలు అగ్నికి ఆహుతయ్యాయి. దీంతో రూ.లక్ష వరకు నష్టం జరిగినట్లు బాధితుడు తహసీల్దార్ కార్యాలయంలో ఫిర్యాదు చేశాడు.

కుప్పంలో మీరే అభ్యర్థులు

● మీరేసే ప్రతి ఓటు ముఖ్యమంత్రికేనన్న చంద్రబాబు
● వైసీపీ నుంచి భారీగా టీడీపీలో చేరికలు

కుప్పం/వి.కోట, మార్చి 26: 'కుప్పంలో అభ్యర్థి నేను కాదు.. మీరే. మీరేసే ప్రతి ఓటు ముఖ్యమంత్రికే. ఈ విషయాన్ని గుర్తుచేస్తూ ప్రజలకు వివరించండి. తద్వారా లక్ష మెజారిటీ ఖచ్చితంగా దాటుతాం' అని చంద్రబాబు అన్నారు. కుప్పంలోని కేవీఆర్ కల్యాణ మండపంలో మంగళవారం నియోజకవర్గంలోని పలువురు వైసీపీ నాయకులు, కార్యకర్తలు చంద్రబాబు సమక్షంలో టీడీపీలో చేరారు. కుప్పం కొత్తపేటకు చెందిన వాసు, నగేష్, భాస్కర్, పార్వతమ్మ, విశ్రాంత పోలీసు అధికారి రాజేంద్రప్రసాద్ వారి అనుచరులతో కలసి టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. రామకుప్పం మండలం నుంచి ముస్లిం మైనారిటీలు టీడీపీలోకి వచ్చారు. శాంతిపురం మండలం నుంచి దుబాయిగౌడ, శ్రీనివాసులు, సీకే వెంకటేష్‌తో పాటు సుమారు 150 మంది టీడీపీలో చేరారు. గుడుపల్లె నుంచీ పెద్ద ఎత్తున పార్టీలో చేరగా.. వీరందరికి చంద్రబాబు పసుపు కండువాలు వేసి ఆహ్వానించారు. నాలుగు మండలాల నుంచి సుమారు వెయ్యి మంది టీడీపీలో చేరారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ.. అరాచక వైసీపీని వీడి.. అభివృద్ధి కోసం టీడీపీలో చేరడం ప్రశంసనీయమన్నారు. వీరిని స్ఫూర్తిగా తీసుకుని గ్రామాలకు గ్రామాలు తరలివచ్చి భావితరాల కోసం టీడీపీని భారీ మెజారిటీతో గెలిపించాలన్నారు. ఆయా కార్యక్రమాల్లో ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, మాజీ ఎమ్మెల్సీ గౌనివాని శ్రీనివాసులు, కుప్పం టీడీపీ ఇన్‌చార్జ్ పీఎస్ మునిరత్నం, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ సురేష్‌బాబు, గాజుల ఖాదర్‌బాషా, మాజీ ఎంపీపీ వెంకటేష్, నేతలు రాజ్‌కుమార్, సత్యేంద్రశేఖర్, గోపినాథ్, ప్రతాప్, దాము, ఉమాపతి, ప్రేమ్ కుమార్, విశ్వనాథనాయుడు, బాబు, ఆనంద రెడ్డి, బేటప్ప నాయుడు, మునిరాజు, చలపతి, ఉయ్యాల జయరామిరెడ్డి, ఉదయ్‌కుమార్, నాగరాజు, కృష్ణానాయక్, ఆంజినేయరెడ్డి, జాకీర్, చాంద్‌బాషా, అన్సర్, మణి, అనసూయ, శ్యామల, చంద్రకళ, వసంతమ్మ, యశోదమ్మ, తిరుమళ్ తదితరులు పాల్గొన్నారు.



కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న చంద్రబాబు

జీడీనెల్లూరు టీడీపీలో సమన్వయ లోపం

● స్థానిక నేతలను కలుపుకుపోని థామస్ ● వీకెండ్ ప్రచారాలకే పరిమితం అవుతున్నారని అసంతృప్తి
● వైసీపీలోని వర్గపోరును అనుకూలంగా మలచుకోలేక సతమతం



చిత్తూరు, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): జీడీనెల్లూరు నియోజకవర్గం వైసీపీలో వర్గపోరు తీవ్రస్థాయిలో ఉంది. నారాయణస్వామి తీరు మీద అనేక మండలాల్లోని ఆ పార్టీ నాయకులు రగిలిపోతూ ఉంటారు. బహిరంగంగానే సవాళ్లు ప్రతిసవాళ్లు సాగుతుంటాయి. నారాయణస్వామి మీద ఉన్న వ్యతిరేకతను గుర్తించిన వైసీపీ అధిష్ఠానం, ఆయన కుమార్తె కృపాలక్ష్మిని రంగంలోకి దించింది. కుమార్తెను వెంటబెట్టుకుని ఆయన తిరుగుతూ ఉన్నా పరిస్థితి సద్దుమణగలేదు. ఒకవైపు ప్రభుత్వం మీద అసంతృప్తి, మరోవైపు వైసీపీలో ఉన్న అంతర్గత విభేదాలు ఇంత తీవ్రంగా ఉన్నా దీనిని అనుకూలంగా మలచుకోవడంలో టీడీపీ అభ్యర్థి థామస్ విఫలమయ్యారని అంటున్నారు. ఎన్నికలు దగ్గరపడ్డా ఆయన తగినంత సమయం నియోజకవర్గంలో తిరగడానికి కేటాయించుకోవడం లేదని, శని, ఆదివారాలే ఎక్కువగా కనిపిస్తుంటారని టీడీపీ స్థానిక నాయకులే అసంతృప్తితో ఉన్నారు. అది కూడా దళితవాడలకే ఆయన ప్రచార పర్యటనలు పరిమితం అవుతున్నాయని అంటున్నారు. పర్యటనలకు వచ్చినపుడు కూడా థామస్ స్థానిక నేతలను కలుపుకుని వెళ్లడం లేదని అంటున్నారు. వారు ఫోన్లు చేసినా స్పందించడం లేదని పెదవి విరుస్తున్నారు. ఈ విషయమై ఆయనను అడిగితే, చెన్నై నగరంలో పేరుమోసిన ఫెర్టిలిటీ ఆసుపత్రి అధినేతనైన తన స్థాయి గురించి వివరిస్తుంటారని చెబుతున్నారు. 'రాష్ట్రమంతా నాయకులు సీట్ల కోసం చంద్రబాబు నాయుడు వెంటపడితే, నా దగ్గరకి మాత్రం పది మంది ఎమ్మెల్యేలనూ, ఆరుగురు ఎంపీలనూ పంపించి పార్టీలోకి ఆహ్వానించారు' అని ఆయన తరచూ చేస్తున్న వ్యాఖ్యలు కూడా స్థానిక నాయకులను కలవరపరుస్తున్నాయి. పైగా కాబోయే ఆరోగ్య మంత్రినంటూ ఆయన చెప్పుకుంటున్న వైనం చూసి వారు నివ్వెరపోతున్నారు. థామస్ తీరు చూసి ఓ మహిళా నేత సొంత నియోజకవర్గాన్ని వదిలిపెట్టి చిత్తూరు, కుప్పం నియోజకవర్గాల్లో మహిళలతో కలిసి ప్రచారం చేసుకుంటున్నారు. నియోజకవర్గ స్థాయిలో పార్టీ కోసం కృషి చేసిన మరో నాయకుడు కూడా థామస్ తీరుతో అసంతృప్తితో ఉన్నట్లు తెలుస్తోంది. పెనుమూరు మండలానికి చెందిన ఓ సీనియర్ నేత, ఎందుకొచ్చిన తంటా అని బెంగళూరుకే పరిమితమైపోయినట్లు సమాచారం. ఇటీవల టీడీపీలో చేరిన ఒక మహిళా నాయకురాలు తలపెట్టిన ఆత్మీయుల సమావేశాన్ని కూడా రద్దు చేయించినట్లు ప్రచారం జరుగుతోంది. ఇలా థామస్ తీరు నచ్చక ఇటీవల నియోజకవర్గంలోని ఆరు మండలాల అధ్యక్షులు, కీలక నాయకులు 15 మంది కలిసి చిత్తూరులోని ఓ హోటల్‌లో సమావేశమయ్యారు. తమ అసంతృప్తిని వెళ్లగక్కారు. థామస్ వ్యవహారశైలి మార్చుకోకపోతే నియోజకవర్గంలో మొదటికే మోసం వస్తుందని పార్టీ నాయకులు ఆందోళన చెందుతున్నారు.

2, 3 తేదీల్లో పుంగనూరు గంగజాతర

తొలిచాటింపు వేసిన తోటికులస్తులు

పుంగనూరు, మార్చి 26: పుంగనూరులో ఏప్రిల్ 2, 3 తేదీల్లో జరిగే సుగుటూరు గంగమ్మ జాతరకు సంబంధించి జమిందారీ కుటుంబీకుల సమక్షంలో తోటికులస్తులు మంగళవారం రాత్రి తొలి చాటింపు వేశారు. స్థానిక నగిరిలోని ప్యాలెస్‌లో జమిందారీ వంశస్తులు సోమశేఖర్‌రాయల్, మల్లికార్జునరాయల్, వీరేంద్రరాయల్‌లు జాతర నిర్వహణపై పట్టణ ప్రముఖులు, పెద్దలు, తోటి, బెస్తకులస్తులు, అధికారులతో చర్చించారు. ఏటా జాతర రోజుకు ముందు వచ్చే మంగళవారం రాత్రి ప్యాలెస్ వద్ద తొలి చాటింపును తోటికులస్తులు వేస్తారు. రెండో చాటింపు ఈనెల 29న, మూడో చాటింపు జాతర జరిగే వచ్చేనెల 2న ఉంటుంది. ఆ రోజున గంగమ్మను ప్యాలెస్ నుంచి బయటకు తెచ్చి తొలిపూజ, భక్తుల దర్శనం, ఊరేగింపు ఉంటుంది. 3న ఊరేగింపు, నిమజ్జనంతో జాతర ముగుస్తుంది. కాగా, జాతర ఏర్పాట్లు, పార్కింగ్, పారిశుధ్యం, తాగునీరు, దుకాణాలు, గొర్రెల సంత తదితర విషయాలపై పుంగనూరు మున్సిపల్ కమిషనర్ నరసింహ ప్రసాద్‌రెడ్డి పరిశీలించారు. ఆయనవెంట సీఐ రాఘవరెడ్డి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ వెంకటసుబ్బయ్య, వారి సిబ్బంది ఉన్నారు.





సుగుటూరు గంగమ్మ - జాతర నిర్వహణపై చర్చిస్తున్న జమిందారీ కుటుంబీకులు

రూ.10 లక్షలకు మించి జరిగే

లావాదేవీలపై నివేదికలివ్వండి

● బ్యాంకర్లకు కలెక్టర్ సూచన

చిత్తూరు కలెక్టరేట్, మార్చి 26: ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన రోజు నుంచి పోలింగ్ జరిగేంతవరకు బ్యాంకుల్లో రూ.10 లక్షలకు పైబడి జరిగే ప్రతి లావాదేవీపై నివేదికలు ఇవ్వాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ షన్మోహన్ సూచించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని మీటింగ్ హాలులో జేసీ శ్రీనివాసులుతో కలిసి ఆయన బ్యాంకర్ల సమన్వయ కమిటీ సమావేశంలో పాల్గొన్నారు. అభ్యర్థుల పేరుపై లేదా వారి ఏజెంట్ల పేరుపై ఖాతాలను ప్రారంభించే విషయంలో బ్యాంకర్లు సహకరించాలని చెప్పారు. అభ్యర్థులు తమ ఎన్నికల ప్రచారాల నిమిత్తం నగదు బదిలీ చేసే విషయంలో ఇబ్బందులు ఏర్పడకుండా ఉండేందుకోసం రిటర్నింగ్ అధికారి, పోలీసు అధికారులకు ముందస్తు సమాచారం ఇవ్వాలన్నారు. బ్యాంకర్లతో సమన్వయం చేసుకునేందుకు చుడా వైస్ ఛైర్మన్ విశ్వనాథ్‌ను సమన్వయ అధికారిగా నియమించినట్లు చెప్పారు. ఎక్స్‌పెండిచర్ నిర్వహణ నోడల్ ఆఫీసర్ కృష్ణారెడ్డి, ఎల్డీఎం హరీష్, వివిధ బ్యాంకుల కంట్రోలింగ్ అధికారులు పాల్గొన్నారు.



బ్యాంకర్ల సమన్వయ సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

పెయిడ్ న్యూస్‌పై నిశిత పరిశీలన

వివిధ ప్రసార మాధ్యమాలలో ప్రసారమయ్యే పెయిడ్ న్యూస్‌పై నిశిత పరిశీలన చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ షన్మోహన్ సూచించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని స్పందన హాలులో మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ కమిటీ (ఎంసీఎంసీ) విధులు నిర్వహిస్తున్న సిబ్బందితో ఆయన సమావేశమయ్యారు. ఎలక్ట్రానిక్ మీడియా, సోషల్ మీడియా, ప్రైవేటు ఎఫ్ఎంలలో ప్రసారాల కొరకు కోడ్ వచ్చిన రోజు నుంచి తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలన్నారు. జేసీ శ్రీనివాసులు, డీఆర్వో పుల్లయ్య, ఎంసీఎంసీ నోడల్ అధికారి నాగేశ్వరరావు, ఐ&పీఆర్ డీడీ పద్మజ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల ప్రచారంలో వలంటీర్



గుడుపల్లె, మార్చి 26: గుడుపల్లె మండల పరిధిలోని యామగానిపల్లెలో సోమవారం జరిగిన వైసీపీ ఎన్నికల ప్రచారంలో వలంటీర్ నాగరాజు పాల్గొన్నట్లు టీడీపీ నేతలు సోషల్ మీడియాలో వైరల్ చేశారు. సీ విజిల్ యాప్‌లోనూ ఈ ఫొటోలు అప్‌లోడ్ చేసి ఫిర్యాదు చేశారు.

కర్ణాటక మద్యం స్వాధీనం : ఇద్దరి అరెస్టు



పట్టుబడిన కర్ణాటక మద్యం

గంగవరం, మార్చి 26: కర్ణాటక మద్యాన్ని కారుతోపాటు స్వాధీనం చేసుకుని, ఇద్దరిని అరెస్టు చేశారు. గంగవరం అర్బన్ సీఐ చిన్నగోవిందు తెలిపిన వివరాల మేరకు.. ముందస్తు సమాచారంతో మంగళవారం వేకువజామున గంగవరం మండలంలోని నంగిలి చెక్‌పోస్టు వద్ద ఎస్‌ఐ ప్రతాప్‌రెడ్డి, సిబ్బంది తనిఖీలు చేపట్టారు. వీరిని చూసి ఓ కారు వేగంగా వెళ్లిపోతుండటంతో పోలీసులు వెంబడించి పట్టుకున్నారు. తనిఖీలు చేయగా.. కర్ణాటకకు చెందిన 180 ఎంఎల్ 352 టెట్రా ప్యాకెట్ల మద్యాన్ని గుర్తించి, స్వాధీనం చేసుకున్నారు. వాహనంలో ఉన్న పూతలపట్టుకు చెందిన పృథ్వీ, విజయ్‌లను అరెస్ట్ చేశారు. సీఐ, ఎస్‌ఐ, సిబ్బందిని ఎస్పీ, డీఎస్పీలు అభినందించారు.

'సదరం' సర్టిఫికెట్ రద్దు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

పుంగనూరు, మార్చి 26: పుంగనూరు ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో సదరం క్యాంపునకు వచ్చినట్లు, వికలత్వం లేకపోయినా కడప జిల్లావాసి అమరనాథ్‌నాయక్‌కు వికలత్వ సర్టిఫికెట్ మంజూరైన విషయం తెలిసిందే. ఇది సర్టిఫికెట్ రద్దయినట్లు మంగళవారం చిత్తూరు డీసీహెచ్ఎస్ డాక్టర్ రాజశేఖర్‌రెడ్డి తెలిపారు. 'పుంగనూరు సదరం క్యాంపులో విచిత్రం' అనే శీర్షికతో ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితమవడంతో విచారించి చర్యలు తీసుకున్నట్లు పేర్కొన్నారు. మానవ తప్పిదం కారణంగానే ఇది జరిగిందని ఆర్థోపెడిక్ డాక్టర్ మధుమోహన్ తెలియజేశారన్నారు. ఈ క్రమంలో సదరం సర్టిఫికెట్ రద్దు చేయాలని అమరనాథ్ కూడా ఫిర్యాదు చేయడంతో ప్రభుత్వం రద్దు చేసి, ఆన్‌లైన్‌లో తొలగించినట్లు వివరించారు.

ఏటీఎంల వద్ద నగదు కాజేస్తున్న మోసగాడి అరెస్టు

పుంగనూరు రూరల్, మార్చి 26: పుంగనూరులోని ఏటీఎం కేంద్రాలకు వచ్చేవారిని మోసం చేసి మూడు నెలలుగా నగదు కాజేస్తున్న ఓ వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. అతడి వద్ద నుంచి రూ.70 వేలను సీజ్ చేసినట్లు పోలీసులు తెలిపారు. మంగళవారం రాత్రి ఎస్‌ఐ రఫీ వివరాలు మీడియాకు తెలిపారు. పలమనేరు మండలం బేరుపల్లె గ్రామం టి.వడ్డూరుకు చెందిన ఎం.చంద్రయ్య కుమారుడు ఎం.దుర్గాప్రసాద్ (26) ఏటీఎంల వద్ద మకాం పెట్టేవాడు. అక్కడికొచ్చే అమాయకులను టార్గెట్ చేసుకుని వారు ఏటీఎంలో డబ్బు డ్రా చేసేటప్పుడు పిన్ నెంబరు గమనించేవాడు. తర్వాత మాయమాటలు చెప్పి వారి వద్ద ఉన్న ఒరిజినల్ ఏటీఎం కార్డును తీసుకుని, తన వద్ద ఉండే డూప్లికేట్ కార్డును ఇచ్చేవాడు. వారు వెళ్లిపోయాక ఏటీఎం నుంచి సంబంధిత వ్యక్తి ఖాతా నుంచి డబ్బులు డ్రా చేసేవాడు. దీనిపై అందిన ఫిర్యాదులతో మంగళవారం స్థానిక తూర్పుమొగసాల వద్ద దుర్గాప్రసాద్‌ను అరెస్టు చేశారు. అతడి వద్ద నుంచి రూ.70 వేలను సీజ్ చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

బయాలజీ పరీక్షకు 557 మంది గైర్హాజరు

చిత్తూరు (సెంట్రల్), మార్చి 26: టెన్త్ పబ్లిక్ పరీక్షల్లో భాగంగా మంగళవారం జరిగిన బయాలజీ పరీక్షకు 557 మంది గైర్హాజరైనట్లు డీఈవో దేవరాజు, పరీక్షల సహాయ కమిషనర్ చాముండేశ్వరి తెలిపారు. 21,667 మంది విద్యార్థులకు గాను 21,040 మంది హాజరు కాగా, 557 మంది గైర్హాజరైనట్లు చెప్పారు.

సెలవుల్లో తరగతులు నిర్వహిస్తే చర్యలు

చిత్తూరు (సెంట్రల్), మార్చి 26: సెలవుల్లో జూనియర్ కళాశాలల్లో తరగతులు నిర్వహిస్తే చర్యలు తప్పవని డీవీఈవో సయ్యద్ మౌల మంగళవారం హెచ్చరించారు. జిల్లాలోని కొన్ని ప్రైవేటు జూనియర్ కళాశాలల యాజమాన్యాలు సెలవుల్లో తరగతులు నిర్వహిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. వెంటనే ఆపకపోతే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

మూడు నోర్లున్న దూడ



గంగాధరనెల్లూరు, మార్చి 26: గంగాధరనెల్లూరు మండలం బుక్కాపట్నం దళితవాడలోని రైతు జిలేబీకి చెందిన ఓ ఆవు మంగళవారం మధ్యాహ్నం మూడు నోర్లున్న దూడను ఈనింది. తలకు మామూలుగా ఉండే నోరుతో పాటు తల ఎత్తి గొంతువద్ద చూస్తే మరో రెండునోర్లు ఉన్నట్లు రైతు కుటుంబం గుర్తించింది. పలువురు స్థానికులు ఈ వింత దూడను చూసేందుకు వచ్చారు.

అక్రమంగా నిల్వచేసిన ఇసుక సీజ్



అక్రమంగా నిల్వ ఉంచిన ఇసుక

చిత్తూరు, మార్చి 26: చిత్తూరు నగర శివార్లలో అక్రమంగా నిల్వ ఉంచిన ఇసుకను మంగళవారం సీజ్ చేసినట్లు ఎస్ఈబీ అడిషనల్ ఎస్పీ సుబ్బరాజు తెలిపారు. చిత్తూరు- పుత్తూరు మార్గంలో నిర్మాణంలోని ఓ కళాశాల భవనం వద్ద ఇసుక అక్రమ నిల్వలు ఉన్నాయని సమాచారం వచ్చిందన్నారు. అక్కడకు వెళ్లి చూడగా పెద్ద ఎత్తున ఇసుక నిల్వచేసి ఉన్నారన్నారు. రెవెన్యూ అధికారుల సమక్షంలో ఇసుకకు సంబంధించిన వివరాలు అడగ్గా, ఎటువంటి బిల్లులు, అనుమతి పత్రాలు లేవని చెప్పారన్నారు. దీంతో అక్కడున్న 700 టన్నుల ఇసుకను రెవెన్యూ అధికారుల సమక్షంలో సీజ్ చేశామని ఆయన తెలిపారు.

ల్యాండ్ టైటిల్ యాక్టు రద్దు చేస్తాం : అమర్

పలమనేరు, మార్చి26 : తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రాగానే వైసీపీ ప్రభుత్వం తీసుకొచ్చిన ల్యాండ్ టైటిల్ యాక్టును రద్దు చేస్తామని మాజీ మంత్రి అమరనాథరెడ్డి తెలిపారు. మంగళవారం పలమనేరు కోర్టు సమీపంలో పలమనేరు బార్ అసోసియేషన్ సభ్యులతో నిర్వహించిన సమావేశంలో ఆయన ప్రసంగించారు. కక్షిదారులకు సత్వర న్యాయం కోసం అవసరమైతే కోర్టు అప్‌గ్రేడ్ కోసం భవిష్యత్‌లో బార్ అసోసియేషన్ సూచనల మేరకు తనవంతు సహకారం అందిస్తామన్నారు. బుధవారం జరగనున్న ప్రజాగళం సమావేశానికి హాజరై జయప్రదం చేయాలని న్యాయవాదులకు విజ్ఞప్తి చేశారు. రాష్ట్రాభివృద్ధి జరగాలంటే విజన్ ఉన్న చంద్రబాబు నాయకత్వాన్ని బలపరచాలన్నారు. తాను పలమనేరు వదలనని, జనం కోసమే పనిచేస్తానని స్పష్టం చేశారు. పలమనేరు బార్ అసోసియేషన్ సభ్యులు కె.లక్ష్మీపతి, జె.సుబ్రహ్మణ్యం, పరమశివప్ప, మధుసూదన్, తదితరులు పాల్గొన్నారు.

'ప్రజాగళం' ఏర్పాట్ల పరిశీలన

టీడీపీ అధినేత చంద్రబాబు బుధవారం పలమనేరులో ప్రారంభించ నున్న ప్రజాగళం కార్యక్రమ ఏర్పాట్లను మంగళవారం మాజీ మంత్రి అమరనాథరెడ్డి పరిశీలించారు. జవుళి వీధిలో బహిరంగ సభకు వచ్చే ప్రజలకు ఇబ్బంది లేకుండా తీసుకోవాల్సిన చర్యలపై స్థానిక టీడీపీ నాయకులతో కలిసి చర్చించారు. అలాగే పలమనేరు సమీపంలోని సాయిబాబా గుడి వద్ద ఏర్పాటు చేసిన హెలీప్యాడ్‌ను కూడా పరిశీలించారు. ప్రోగ్రాం ఇన్‌చార్జి వెంకటేసులు, నియోజకవర్గ పరిశీలకుడు జయప్రకాష్, నాయకులు ఆర్బీసీ కుట్టి, గిరిబాబు, ఖాజాపీర్, నాగరాజు, పెద్దబ్బ, సుబ్బు, మంజునాథ్, జనసేన నాయకులు పూలచైతన్య, హరీష్ పాల్గొన్నారు.



టీడీపీ నాయకులతో కలిసి హెలిపాడ్ వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న అమరనాథరెడ్డి

నలగుండ్రాయస్వామికి పుష్పయాగం



బైరెడ్డిపల్లె, మార్చి 26: కడపనత్తం గ్రామంలోని నలగుండ్రాయస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామివారికి మంగళవారం పుష్ప యాగం నిర్వహించారు. ఆలయ అర్చకులు శ్రీవారి ఉత్సవర్లకు విశేషాలంకరణ గావించి, వివిధరకాల పుష్పాలను నివేదించారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయ ధర్మకర్త మురళి, కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

వైభవంగా చక్రస్నానం

పుంగనూరు, మార్చి 26: కోనేటి వద్ద ఉన్న కల్యాణ వెంకటరమణస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం టీటీడీ ఆధ్వర్యంలో చక్రస్నానాన్ని వైభవంగా నిర్వహించారు. ఉదయాన్నే స్వామివారికి ప్రత్యేక పూజలు చేసి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. మధ్యాహ్నం ఉత్సవర్లకు స్నపన తిరుమంజనం చేశాక చక్రస్నానం జరిగింది. ఆలయ ఇన్‌స్పెక్టర్ మునీంద్రబాబు, అర్చకులు శ్రీనివాసాచార్యులు, శ్రీకాంత్, పృథ్వీకుమార్, సిబ్బంది చెంగప్ప, భక్తులు పాల్గొన్నారు.

హంస వాహనంపై శ్రీవారి విహారం



సోమల, మార్చి 26: ఆవులపల్లెలోని ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాల సందర్భంగా మంగళవారం శయనోత్సవం శాస్త్రోక్తంగా జరిపారు. ఉదయం మూల విరాట్‌కు అభిషేకపూజలు నిర్వహించి, భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. అనంతరం శ్రీదేవి, భూదేవి శ్రీవారి ఉత్సవర్లను హంస వాహనంపై అధిష్ఠింపజేసి ఊరేగించారు. టీటీడీ అధికారులు, ఉభయదారులు పాల్గొన్నారు.

ముత్యాలమ్మ ఆలయంలో మండల పూజ

కల్లూరు, మార్చి 26: పులిచెర్ల మండలం రాయవారిపల్లి పంచాయతీ గెలసంవారిపల్లిలో ఇటీవల నూతనంగా నిర్మించిన ముత్యాలమ్మ ఆలయంలో మంగళవారం అమ్మవారి 40రోజుల మండల పూజ నిర్వహించారు. మాజీ సర్పంచ్ జయసుధ నాగరాజనాయుడు, నాగసుందరంస్వామి పాల్గొన్నారు.

వాహనాల తనిఖీలు

సోమల, మార్చి 26: సోమల - కందూరు రహదారిలో మంగళవారం పోలీసులు వాహనాల తనిఖీలు చేపట్టారు. మద్యం తాగి ఆటో నడుపుతున్న డ్రైవర్‌కు అపరాధ రుసుం విధించి, కౌన్సెలింగ్ ఇచ్చారు. ఎస్‌ఐ వెంకట నరసింహులు, హెచ్‌సీలు బాలచంద్ర, దేవరాజులు, రిజ్వాన్ పాల్గొన్నారు.

టెన్త్ పరీక్షకు 31 మంది గైర్హాజరు

పలమనేరు, మార్చి 26: పలమనేరు మండలంలో మంగళవారం జరిగిన పదో తరగతి జీవశాస్త్రం పరీక్షకు 31మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని ఎంఈవోలు లీలారాణి, బాలసుందరం తెలిపారు. మండలంలోని ఆరు పరీక్ష కేంద్రాల్లో 1,365మందికిగాను 1,334 మంది హాజరయ్యారని పేర్కొన్నారు.

'మదర్ థెరిసా' విద్యార్థుల ప్రతిభ



గంగవరం, మార్చి 26: మదర్ థెరిసా కళాశాల విద్యార్థులు వివిధ రకాల పోటీల్లో ప్రతిభ చూపారని కరస్పాండెంట్ రవీంద్రబాబు తెలిపారు. వేము ఇంజనీరింగ్ కళాశాల, తిరుపతిలోని శ్రీరామా ఇంజనీరింగ్ కళాశాలలో జరిగిన పేపర్ ప్రజెంటేషన్ పోటీలో.. ఎంబీఏ విద్యార్థులు వంశీధర్, కల్పన, మార్కెటింగ్‌లో.. పి.బాలాజి, వంశీధర్, కోటేశ్వరి, మౌనిక ప్రథమ స్థానంలో నిలిచారన్నారు. బిజినెస్ క్విజ్‌లో.జ భాస్కర్, వినయ్ రెండో స్థానంలో, మహమ్మద్ హర్ష కన్సొలేషన్ బహుమతి సాధించారన్నారు. వీరిని ఛైర్మన్ సునీల్, డైరెక్టర్ రాజేంద్రరెడ్డి, ప్రిన్సిపాల్ వెంకటరావు, హెచ్‌వోడీ వీణ, అధ్యాపకులు అభినందించారు.

ఓటరు చైతన్య ర్యాలీ

శాంతిపురం, మార్చి 26: రాళ్లబూదుగూరు గ్రామంలో మంగళవారం ఓటరు చైతన్య ర్యాలీ నిర్వహించారు. ఓటు హక్కును అందరూ సక్రమంగా వినియోగించుకోవాలని సూచించారు. కుప్పం వెలుగు ఏరియా కోఆర్డినేటర్ చంద్రశేఖర్, ఏపీఎం గ్రీటా, పీఎంజీ మోహన్, సీసీలు పాల్గొన్నారు.

చంద్రబాబును భారీ మెజారిటీతో గెలిపించుకుంటాం: ఎమ్మార్పీఎస్



శాంతిపురం, మార్చి 26: కుప్పంలో చంద్రబాబును భారీ మెజారిటీతో గెలిపించుకుంటామని నియోజకవర్గ ఎమ్మార్పీఎస్ ఇన్‌చార్జి రాజ్‌కుమార్ అన్నారు. మంగళవారం చంద్రబాబును ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో కలిశారు. జిల్లా అధ్యక్షుడు ప్రకాష్ మాదిగ, నియోజకవర్గ సీనియర్ నాయకులు పాపన్న, శాంతిపురం, రామకుప్పం మండలాల అధ్యక్షులు రవీంద్రమాదిగ, గోవిందప్ప, నేతలు ఉదయకుమార్, రమేష్, జయప్ప, బాబు, జైరామ్, వెంకటరమణ, నాగరాజు, శాంతి, పూజ, నవిత, తదితరులున్నారు.

భారీ మెజారిటీతో గెలిపించండి

టీడీపీ కార్యకర్తలు, ప్రజలకు చంద్రబాబు వినతి





జనంనుంచి అర్జీలను స్వీకరిస్తూ.. హంద్రీ-నీవా కాలువను పరిశీలిస్తున్న చంద్రబాబు

శాంతిపురం, మార్చి 26: రానున్న ఎన్నికల్లో తనను భారీ మెజారిటీతో గెలిపించాలని టీడీపీ కార్యకర్తలకు, ప్రజలకు మాజీ సీఎం చంద్రబాబు విజ్ఞప్తి చేశారు. మంగళవారం రామకుప్పం పర్యటనకు కాన్వాయ్‌లో వెళుతున్న చంద్రబాబును చూడటానికి పరిసర గ్రామాల నుంచి పెద్ద ఎత్తున టీడీపీ కార్యకర్తలు, మహిళలు, యువకులు తరలివచ్చి రోడ్డుపై వేచిఉన్నారు. వీరిని గమనించిన చంద్రబాబు కాన్వాయ్ ఆపి.. వాహనందిగి వారితో ముచ్చటించి, ముందుకు కదిలారు. కాగా, శాంతిపురం మండలం మఠం జూనియర్ కళాశాల సమీపంలోని పొన్నేపల్లె వద్ద భారీ ఎత్తున మహిళలు చంద్రబాబుకు స్వాగతం పలికారు. అలాగే నాయనపల్లె, రాజుపేట క్రాస్ వద్ద టీడీపీ నాయకులు ఘన స్వాగతం పలికారు. రాజుపేట వద్ద కర్ణాటక సరిహద్దుల నుంచి తిరిగి ఆంధ్రా పరిహద్దుల వరకు కర్ణాటక పోలీసులుభారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

సొంతింటి నిర్మాణ పనుల పరిశీలన

శాంతిపురం మండలం కడపల్లె సమీపంలో శివపురం వద్ద నూతనంగా నిర్మిస్తున్న సొంత ఇంటిపనులను చంద్రబాబు పరిశీలించారు. మంగళవారం కుప్పం నుంచి రామకుప్పానికి వచ్చి తిరుగు ప్రయాణంలో మార్గమధ్యంలో ఇంటి నిర్మాణ పనులను తిలకించారు. త్వరగా పూర్తి చేయాలని అక్కడున్న వారికి చెప్పారు. ఈ సందర్భంగా ఆయనకు స్థానికులు మంగళ హారతులు పట్టారు.

50 కుటుంబాలు టీడీపీలో చేరిక

రామకుప్పం: చంద్రబాబు సమక్షంలో రామకుప్పం నుంచి సుమారు 50 కుటుంబాలు వైసీపీ నుంచి టీడీపీలో చేరారు. వారందరికీ చంద్రబాబు పసుపు కండువాలు కప్పి, పార్టీలోకి ఆహ్వానించారు. ముఖ్యంగా శివాజీనగర్ వార్డు సభ్యురాలు సుస్మిత, వైసీపీ రామకుప్పం పట్టణ ముఖ్యనేత సుబ్రహ్మణ్యం, మాజీ మండల వైసీపీ ప్రధాన కార్యదర్శి రమేష్‌రెడ్డితోపాటు భారీ ఎత్తున ముస్లిం, మైనారిటీ నాయకులు జలీల్‌సాబ్, ముక్తియార్, హారాబాష, బర్కత్, తౌసిఫ్, షౌకత్, ఫక్రుద్దీన్, అక్బర్, మునవర్, రషీద్ తదితరులు పార్టీలో చేరారు. నేతలు సలాం సాబ్, కల్చర్ ఇన్‌చార్జ్ మహ్మద్‌రఫీ, హనీఫ్, ఆదిల్ తదితరులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే టీడీపీ ధ్యేయం: చల్లా బాబు



చల్లా రామచంద్రారెడ్డిని సన్మానిస్తున్న మైనార్టీ నాయకులు

పుంగనూరు, మార్చి 26: పేదల సంక్షేమే తమ పార్టీ ధ్యేయమని పుంగనూరు టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి చల్లా రామచంద్రారెడ్డి (బాబు) అన్నారు. మంగళవారం పట్టణంలోని బెస్తవీధి, చెంగారెడ్డివీధి, నాగపాళ్యం, ఎంబీటీ రోడ్డు తదితర ప్రాంతాల్లో విస్తృతంగా పర్యటించి.. టీడీపీ మేనిఫెస్టో ముద్రించిన కరపత్రాలను ఇంటింటా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పట్టణంలోని కాల్వలపై చిరు వ్యాపారుల దుకాణాలను వైసీపీ నాయకులు తొలగించడం బాధాకరమన్నారు. రోడ్డు విస్తరణ పనుల్లో కూడా రాజకీయం చేయడం సిగ్గు చేటన్నారు. పేదవారి భవనాలైతే కూల్చివేయడం, వైసీపీ నాయకులవైతే కొలతలు తగ్గించి పనులు చేయడం సరికాదన్నారు. వైసీపీ పాలనలో రాష్ట్రం పూర్తిగా వెనుకబడిపోయిందని వాపోయారు. రాష్ట్రాభివృద్ధి జరగాలంటే టీడీపీ గెలుపు అవసరమన్నారు. టీడీపీ నాయకులు శ్రీకాంత్, మాధవరెడ్డి, సీవీరెడ్డి, పోలీస్‌గిరి, సుహేల్‌బాషా, సుబ్రహ్మణ్యంరాజు, దేశాధి ప్రకాశ్, శమిపతి, దినేశ్, మణి, రామయ్య, రమణ, వెంకటరమణ, శ్రీనివాసులు, చంద్ర, ప్రసాద్, డీకే శ్రీనివాసులు, కృష్ణానాయక్, వెంకటస్వామి, జనసేన నాయకులు పగడాల రమణ, విరూపాక్షి, చిన్నారాయల్, చైతన్యరాయల్, హరినాయక్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఒక్క అవకాశమిస్తే.. పుంగనూరును అభివృద్ధి చేస్తా

రాష్ట్రంలోనే రౌడీషీట్ అర్హత ఉన్న మొదటి వ్యక్తి పెద్దిరెడ్డి : బీసీవై





సభలో ప్రసంగిస్తున్న రామచంద్రయాదవ్ - హాజరైన ప్రజలు

చౌడేపల్లె, మార్చి 26: ఒక్క అవకాశం ఇస్తే పుంగనూరును అభివృద్ధి చేసి చూపిస్తానని బీసీవై అధ్యక్షుడు బోడే రామచంద్రయాదవ్ అన్నారు. మంగళవారం స్థానిక బస్టాండులో జరిగిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ.. 15 ఏళ్ల నుంచి ప్రశాంతంగా ఉన్న పుంగనూరులో కక్షలు, అరాచకాలమయం చేసిన ఘనత మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి దక్కిందని విమర్శించారు. ప్రతి పక్షనేత చంద్రబాబును సైతం పుంగనూరులో తిరగనీయకుండా చేసి, దౌర్జన్యాలకు పాల్పడి, సుమారు 500 మందిపై తప్పుడు కేసులు పెట్టించిన ఘనత ఆయనదే అన్నారు. ప్రాజెక్టుల పేరుతో సుమారు రూ.2,150 కోట్లు దోచుకున్నారని విమర్శించారు. రాష్ట్రంలో రౌడీషీట్ తెరవడానికి అర్హత ఉన్న మొదటి వ్యక్తి పెద్దిరెడ్డి అని దుయ్యబట్టారు. ఇక తనకు అవకాశమిస్తే నియోజకవర్గంలోని ప్రతి రైతుకూ ఓ పాడి ఆవు ఉచితంగా ఇస్తానని, ప్రతి మండలంలో ఒక పాల డెయిరీ ఏర్పాటు చేసి గిట్టుబాటు ధర కల్పిస్తానన్నారు. పతంజలి వంటి పరిశ్రమలను పుంగనూరులో ఏర్పాటు చేసి, 15వేల మంది నిరుద్యోగులకు ఉపాధి కల్పిస్తానని చెప్పారు. పార్టీ నాయకులు హరిబాబుయాదవ్, హరినాథరెడ్డి, సాంబమూర్తి, ఆనంద్, అల్లాబక్ష, మున్నా, వెంకటేశ్, కిరణ్, పాల రమేష్ పాల్గొన్నారు.

ఎన్నికల నియమావళి ఉల్లంఘించారని రామచంద్రయాదవ్‌పై కేసు

ఎన్నికల నియమావళి ఉల్లంఘించారని బీసీవై అధినేత రామచంద్రయాదవ్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ ప్రతాప్‌రెడ్డి తెలిపారు. చౌడేపల్లె బస్టాండు సమీపంలో చారాల కెళ్లే రోడ్డులో మీటింగ్‌కు ఆర్వో మధుసూదన్‌రెడ్డి వద్ద బీసీవై అధినేత అనుమతి తీసుకున్నారని, అయితే బస్టాండు కూడలిలో మీటింగ్ నిర్వహించారని పేర్కొన్నారు. రోడ్డుపై టపాకాయలు పేల్చారన్నారు. ఈక్రమంలో ఎన్నికల నియమావళి ఉల్లంఘించారని పంచాయతీ సెక్రటరీ సుధాకర్ ఇచ్చిన ఫిర్యాదుతో రామచంద్ర యాదవ్‌తోపాటు నారాయణ స్వామి, హరినాథ్‌రెడ్డి, బీసీవై కార్యకర్తలపై కేసు నమోదు చేసినట్లు వివరించారు.

డబ్బులు తరలించడానికే జగన్ బస్సు యాత్ర

వాహనాలను పోలీసులు తనిఖీ చేయాలి: టీడీపీ



మీడియాతో మాట్లాడుతున్న టీడీపీ నేతలు

శాంతిపురం, మార్చి 26: సీఎం జగన్ బస్సు యాత్ర చేపడుతున్నది ఎన్నికలకు డబ్బులు తరలించడానికే అని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సప్తగిరి ప్రసాద్, జిల్లా ప్రధాన కార్యదర్శి కోదండయాదవ్ ఆరోపించారు. మంగళవారం కుప్పం పార్టీ కార్యాలయంలో మైనార్టీ సెల్ జిల్లా కార్యదర్శి షబ్బీర్ బాష, తవణంపల్లె ప్రధాన కార్యదర్శి మధుయాదవ్‌తో కలిసి మీడియాతో మాట్లాడారు. పోలీసులకు చిత్తశుద్ధి ఉంటే జగన్మోహన్‌రెడ్డి వాహనాలను, అతని కాన్వాయ్‌ని పూర్తిగా తనిఖీలు చేయాలన్నారు. పోలీసుల ఏకపక్ష నిర్ణయాలపై ఎన్నికల కమిషన్ జోక్యం చేసుకుని తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

సాయుధ బలగాలతో పోలీసు కవాతు

కల్లూరు, మార్చి 26: ప్రజలు స్వేచ్ఛగా, నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకోవాలని కల్లూరు సీఐ శ్రీనివాసులు, ఎస్‌ఐ రవిప్రకాష్‌రెడ్డి తెలిపారు. పులిచెర్ల మండలంలోని ఎల్లంకివారిపల్లి, మంగళంపేట, పులిచెర్ల, కల్లూరు, బీసీ కాలనీ, తలారివారిపల్లి ప్రాంతాల్లో మంగళవారం కేంద్ర సాయుధ బలగాలతో పోలీసు కవాతు నిర్వహించారు.

కాంగ్రెస్ సోమల అధ్యక్షుడిగా బాబు నాయుడు

సోమల, మార్చి 26: కాంగ్రెస్ సోమల మండల అధ్యక్షుడిగా నెల్లిమందకు చెందిన బాబు నాయుడిని నియమించినట్లు పుంగనూరు ఇన్‌చార్జి రామకృష్ణారెడ్డి తెలిపారు. మంగళవారం రాయచోటిలో జరిగిన రాజంపేట పార్లమెంట్ స్థాయి కార్యకర్తల సమావేశంలో ఏపీ మీడియా ఛైర్మన్ తులసిరెడ్డి నుంచి నియామక పత్రం అందుకున్నారు.

ప్రేమించి పెళ్లి చేసుకున్నాం.. రక్షణ కల్పించండి

చౌడేపల్లె, మార్చి 26: పెళ్లి చేసుకున్నాం రక్షణ కల్పించండి అని ఓ ప్రేమజంట పోలీసులను ఆశ్రయించింది. చారాల పంచాయతీ ఓదులపేటకు చెందిన కీర్తి, అదే గ్రామానికి చెందిన రాజశేఖర్‌రెడ్డిలు ఏడాది నుంచి ప్రేమించుకుంటున్నారు. ఇద్దరూ మేజర్లు.. పైగా సమీప బంధువులు కావటంతో రహస్యంగా పెళ్లి చేసుకున్నారు. తర్వాత తమపెళ్లికి ఇద్దరి ఇళ్లల్లోనూ అంగీకరించరని భయపడి పోలీసులను ఆశ్రయించారు. ఎస్‌ఐ ప్రతాప్‌రెడ్డి వారితల్లిదండ్రులకు కౌన్సెలింగ్‌ఇచ్చి.. ప్రేమజంటకు న్యాయం చేశారు.

ఆరుగురు జూదరుల అరెస్టు

సదుం, మార్చి 26: పాలమంద సవటవంక సమీపంలో ఆరుగురు జూదరులను అరెస్టు చేశారు. వారి వద్దనుంచి రూ.5,270స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐమారుతి తెలిపారు.

భార్యపై అనుమానంతో పక్కింటి వ్యక్తిపై దాడి

పుంగనూరు రూరల్, మార్చి 26: భార్యపై అనుమానంతో ఓ భర్త మద్యం మత్తులో పక్కింటి వ్యక్తిపై దాడి చేశాడు. చౌడేపల్లె మండలం ఆమినిగుంటకు చెందిన సుబ్రహ్మణ్యం తన భార్యపై అనుమానంతో సోమవారం రాత్రి పక్కింట్లోని రమేశ్‌బాబుపై కత్తితో దాడిచేసి గాయపరిచాడు. బాధితుడిని కుటుంబీకులు చికిత్స నిమిత్తం పుంగనూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోలీసులు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చిత్తూరు
జీడీ నెల్లూరు/పూతలపట్టు/నగరి

సేవచేయడానికి వచ్చాం... గెలిపించండి


బండపల్లిలో ప్రచారం నిర్వహిస్తున్న గురజాల ప్రతిమ

గుడిపాల, మార్చి 26: పేద ప్రజలకు సేవచేయడానికే రాజకీయాల్లోకి వచ్చామని గురజాల చెన్నకేశవులు నాయుడు, గురజాల ప్రతిమ అన్నారు. అధికారం ఉన్నా లేకపోయినా జీజేఎం ఫౌండేషన్ ద్వారా అనేక సేవా కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. మండలంలోని ఏఎల్‌పురం, చిత్తపార, బండపల్లి, వెప్పాలమానుచేనులో టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి జగన్మోహన్ నాయుడును గెలిపించాలని ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం నాయుడు, మాజీ ఎంపీపీ దీపశ్రీ, మాజీ జడ్పీటీసీ సుమతి, మండల మహిళా అధ్యక్షురాలు ఉదయ, మాజీ ఎంపీటీసీ విక్టోరియా, మహిళలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

స్పందన నూతన హాలు పరిశీలన

చిత్తూరు కలెక్టరేట్, మార్చి 26: పూర్తి హంగులతో నిర్మిస్తున్న స్పందన నూతన హాలులో మౌలిక వసతుల కల్పనను త్వరితగతిన పూర్తిచేయాలని అధికారులను కలెక్టర్ షన్మోహన్ ఆదేశించారు. కలెక్టరేట్ ప్రాంగణంలో నూతనంగా ఏర్పాటు చేస్తున్న స్పందన హాలును మంగళవారం ఆయన పరిశీలించారు. అక్కడ కొనసాగుతున్న పనులను అధికారుల నుంచి అడిగి తెలుసుకున్నారు. స్పందన హాలులో ఫర్నీచర్, పబ్లిక్ అడ్రెసింగ్ సిస్టం, పెయింటింగ్, ఇతర నిర్మాణపనులను త్వరితగతిన పూర్తిచేసి త్వరగా వినియోగంలోకి తీసుకొచ్చేందుకు చర్యలు తీసుకోవాలని పంచాయతీరాజ్ శాఖ అధికారులను ఆదేశించారు. కలెక్టర్ వెంట జేసీ శ్రీనివాసులు, డీఆర్వో పుల్లయ్య, పంచాయతీరాజ్ ఎస్ఈ చంద్రశేఖర్ రెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

పక్కాగా తనిఖీలు చేయండి: జేసీ


గత్రాళ్లమిట్టలో పోలింగ్ బూత్‌లను పరిశీలిస్తున్న జేసీ శ్రీనివాసులు

గుడిపాల, మార్చి 26: అన్ని సౌకర్యాలు ఉంటేనే పోలింగ్ బూత్‌లను ఏర్పాటు చేయాలని, తమిళనాడు సరిహద్దుల్లో చెక్‌పోస్టుల వద్ద పోలీసులు పక్కాగా తనిఖీలు నిర్వహించాలని జేసీ శ్రీనివాసులు అన్నారు. మంగళవారం మండలంలోని మండిక్రిష్ణాపురం, గత్రాళ్ళమిట్ట, నంగమంగళం, డీబీ పల్లి, బొమ్మసముద్రం, మరకాల కుప్పం, కుప్పిగానిపల్లె, తిమ్మాపల్లి పోలింగ్ బూత్‌లను ఆయన పరిశీలించి లైట్లు, మౌలిక వసతుల కల్పనకు ఎలాంటి చర్యలు చేపట్టారని తహసీల్దార్ విజయలక్ష్మిని అడిగి తెలుసుకున్నారు. ఎటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అనంతరం తమిళనాడు సరిహద్దు ప్రాంతమైన శాంతిపురంలో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టును పరిశీలించి, తనిఖీలు ఏ విధంగా నిర్వహిస్తున్నారని అడిగి తెలుసుకున్నారు. జేసీ వెంట ఎంపీడీవో రాజశేఖర్ రెడ్డి, ఎంఈవో రామ్‌నాయక్, సర్వేయర్ కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధి పనులకు విరాళం



ఐరాల (కాణిపాకం), మార్చి 26: ప్రముఖ పుణ్యక్షేత్రమైన కాణిపాక ఆలయం వద్ద నిర్వహిస్తున్న పలు అభివృద్ధి పనుల కోసం హైదరాబాద్‌కు చెందిన కీర్తివిహాన్‌విరాట్ మంగళవారం రూ.1,16,000 విరాళంగా అందించారు. విరాళదాతకు ఆలయ ఇన్‌స్పెక్టర్ విఘ్నేష్ స్వామి దర్శన ఏర్పాట్లను పర్యవేక్షించారు. దర్శనానంతరం దాతను ఆశీర్వదించి స్వామి శేషవస్త్రాలు, తీర్థప్రసాదాలు, జ్ఞాపికను అందించారు.

పేదలకు అన్నదానం

పూతలపట్టు, మార్చి 26: మండలంలోని అంబేడ్కర్ సర్కిల్ వద్ద మంగళవారం జరిగిన అన్నదాన కార్యక్రమానికి పంటపల్లి గ్రామస్తులు భోజనం వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ దొరబాబు చౌదరి, పంటపల్లి గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఎన్నికల నిర్వహణకు సహకరించండి: డీఎస్పీ

గుడిపాల, మార్చి 26: ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేవిధంగా ప్రజలు సహకరించాలని చిత్తూరు డీఎస్పీ రాజగోపాల్ రెడ్డి, వెస్ట్ సీఐ రవిశంకర్ అన్నారు. మంగళవారం మండలంలోని మరకాలకుప్పంలో ఎన్నికల నియమావళిపై గ్రామస్తులకు తగిన సూచనలు చేశారు. ఎటువంటి ఘర్షణలకు పాల్పడకుండా మీ ఓటును నిర్భయంగా వేసుకోవాలని ఆయన కోరారు. గ్రామాల్లో గుర్తు తెలియని వ్యక్తులు ఎవరైనా వచ్చిన వెంటనే మా దృష్టికి తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ శ్రీనివాసరావు, గ్రామ పెద్దలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

సర్పంచ్ మృతికి టీడీపీ నేతల నివాళి


నివాళులర్పిస్తున్న టీడీపీ నాయకులు

పాలసముద్రం, మార్చి 26: మండలంలోని ఎస్ఆర్ఆర్ కండ్రిగ సర్పంచ్ జయలక్ష్మి మృతదేహానికి మంగళవారం పాలసముద్రం, కార్వేటినగరం మండలాలకు చెందిన పలువురు టీడీపీ నాయకులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె కుమారుడు, వ్యాపారవేత్త, తిరుపతి చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు మోహన్ రాజ్‌ను వారు పరామర్శించారు. నివాళులర్పించిన వారిలో టీడీపీ నేతలు భీమనేని చిట్టిబాబు నాయుడు, వాసు నాయుడు, శేఖర్ రాజు, కంఠం ప్రతాప్ నాయుడు, రవి నాయుడు, నిధి, జనార్దన్ రాజు, నాగేశ్వరరాజు తదితరులు పాల్గొన్నారు.

చెక్‌పోస్టు తనిఖీ



గుడిపాల, మార్చి 26: మండలంలోని నరహరిపేట చెక్‌పోస్టును అసిస్టెంట్ కమిషనర్ సుధాకర్ రెడ్డి, ఎస్ఈబీ జిల్లా అధికారి శ్రీధర్‌రావు మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు ఎన్నికల నియమావళిపై ఎలాంటి చర్యలు చేపడుతున్నారని ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ మునస్వామి, సిబ్బంది పాల్గొన్నారు.

బంగారమ్మ గుడిలో విశేష పూజలు



కార్వేటినగరం, మార్చి 26: కార్వేటినగరం గ్రామదేవత బంగారమ్మ ఆలయంలో మంగళవారం విశేష పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు ఆలయ కమిటీ అధ్యక్షులు ప్రసాద్ తీర్థప్రసాదాలు అందజేశారు.

రోడ్డుపక్కనే వ్యర్థాల డంపింగ్

● దుర్వాసనతో ప్రజలకు అవస్థలు


రోడ్డుపక్కన పడేసిన బాటిళ్లు, వాటర్‌ప్యాకెట్లు

పెనుమూరు, మార్చి 26: మండలంలోని శాతంబాకం సమీపంలోని గంగుపల్లి చెరువు వద్ద రోడ్డు పక్కన పడేసిన వ్యర్థాలతో డంపింగ్ యార్డులా మారిపోయింది. మందుబాబులు తాగి పడేసిన మద్యం బాటిళ్లు, వాటర్‌ప్యాకెట్‌లు, చికెన్ వ్యర్థాలు, పరిసరాల్లోని ఇళ్ల నిర్మాణాల వ్యర్థాలను తీసుకువచ్చి రోడ్డు పక్కనే పడేయడంతో దుర్వాసనతో పాటు దోమలు కూడా అధికంగా ఉన్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చాలా కాలంగా ఇక్కడ వ్యర్థాలు పోస్తున్నారని అధికారులకు చెప్పినా పట్టించుకోవడంలేదని స్థానికులు చెబుతున్నారు. అయితే ఈ ప్రదేశం తమ పరిధిలోకి రాదంటూ ఒకరిపై మరొకరు చెప్పుకుంటూ పంచాయతీ కార్యదర్శులు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నట్లు సమాచారం. ఈ సమస్యపై అధికారులు స్పందించి వ్యర్థాలు తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ఇన్‌చార్జ్ డీఎంహెచ్‌వోగా రవిరాజు బాధ్యతల స్వీకరణ



చిత్తూరు రూరల్, మార్చి 26: చిత్తూరు ఇన్‌చార్జ్ డీఎంహెచ్‌వోగా డీఐవో డాక్టర్ రవిరాజు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. డీఎంహెచ్‌వోగా పనిచేస్తున్న ప్రభావతిదేవి మెడికల్ లీవ్‌పై వెళ్లారు. ఆమె స్థానంలో డీఐవోగా పనిచేస్తున్న డాక్టర్ రవిరాజును ఇన్‌చార్జ్ డీఎంహెచ్‌వోగా నియమిస్తూ కలెక్టర్ షన్మోహన్ ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. ఆయన మంగళవారం బాధ్యతలు స్వీకరించారు.

వ్యాక్సిన్ రికార్డులను అప్‌డేట్ చేయాలి

గంగాధరనెల్లూరు, మార్చి 26: పీహెచ్‌సీలోని వ్యాక్సిన్ రికార్డులను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలని ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో డాక్టర్ రవిరాజు సిబ్బందిని ఆదేశించారు. గంగాధరనెల్లూరు పీహెచ్‌సీలో వివిధ రికార్డులను, వ్యాక్సిన్‌లు, మందులు, మాత్రల స్టాకు వివరాలను, గదులను మంగళవారం ఆయన తనిఖీచేసి పరిశుభ్రంగా ఉంచాలన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ప్రవీణ్, సీహెచ్‌వో శ్రీనివాసులు, ఫార్మాసిస్ట్ నాగలక్ష్మీ, స్టాఫ్‌నర్స్ నిర్మల, ల్యాబ్‌టెక్నీషియన్ షానవాజ్ పాల్గొన్నారు.

చంద్రబాబు పాలనతోనే రాష్ట్రాభివృద్ధి

● గురజాల జగన్మోహన్


ప్రచారం నిర్వహిస్తున్న గురజాల, సీకే బాబు తదితరులు

చిత్తూరు సిటీ, మార్చి 26: టీడీపీ అధినేత చంద్రబాబు పాలనతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీల ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి గురజాల జగన్మోహన్ అన్నారు. మంగళవారం ఉదయం స్థానిక 5వ డివిజన్ సాంబయ్య కండ్రిగలోని సాయిబాబా ఆలయంలో పూజలు నిర్వహించిన అనంతరం సీకేపల్లి, రఘురాంనగర్, పోలీస్‌కాలనీ, విజయనగర్, కామేశ్వర్‌నగర్,మురుగానిపల్లి, రాజాజీనగర్ తదితర ప్రాంతాల్లో ప్రచారం నిర్వహించారు. సాయంత్రం 7వ డివిజన్ కొంగారెడ్డిపల్లె, 6 డివిజన్ కన్నికాపురం, సంజయ్ గాంధీనగర్, మున్సిపల్ క్వార్టర్స్ తదితర ప్రాంతాల్లో ఇంటింటికి తిరిగి టీడీపీ కరపత్రాలను పంచిపెట్టారు. గురజాల మాట్లాడుతూ చంద్రబాబుకు ఉన్న పరిపాలన, రాజకీయ అనుభవంతో ఇతర దేశాల్లోని ప్రముఖ కంపెనీలను రాష్ట్రానికి తీసుకువచ్చి నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించారని చెప్పారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సీఎం జగన్ అనేక పథకాలను రద్దుచేశారని విమర్శించారు. తనను ఎమ్మెల్యేగా గెలిపిస్తే మౌలిక వసతులు కల్పిస్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, మాజీ ఎమ్మెల్యే సీకే బాబు, మాజీ ఎంపీ దుర్గా రామకృష్ణ, మాజీ మేయర్ కటారి హేమలత, నేతలు వసంత్ కుమార్, బీజేపీ నేతలు చిట్టిబాబు, అట్లూరి శ్రీనివాసులు, బాబు, జనసేన నేతలు దయారాం, యశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.

అచ్చెన్నాయుడిని కలిసిన భీమనేని



పాలసముద్రం, మార్చి 26: జన్మదినోత్సవం సందర్భంగా మంగళవారం తిరుమల వచ్చిన రాష్ట్ర టీడీపీ అధ్యక్షుడు అచ్చెన్నాయుడిని ఆ పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి భీమనేని చిట్టిబాబు నాయుడు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

కొల్లాగుంట చెక్‌పోస్ట్‌లో తనిఖీలు



కార్వేటినగరం మార్చి 26: మండలంలోని కొల్లాగుంట వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్ట్‌లో తమిళనాడు నుంచి ఏపీలోకి వచ్చే వాహనాలను పోలీసులు విస్తృతంగా తనిఖీ చేస్తున్నారు. ఎలక్షన్ కోడ్ అమల్లోకి రావడంతో కొల్లాగుంట వద్ద జిల్లా పోలీస్ అధికార యంత్రాంగం చెక్‌పోస్టను ఏర్పాటు చేసింది. ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో అక్రమ మద్యం ఆంధ్రాలోకి ప్రవేశించకుండా ఎక్సైజ్ అధికారులు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు.

పకడ్బందీగా ఎన్నికల నియమావళి అమలు

చిత్తూరు, మార్చి 26: నగరపాలక పరిధిలో ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పకడ్బందీగా అమలుచేయాలని ఏఆర్వో, కమిషనర్ అరుణ ఎన్నికల బృందాలను ఆదేశించారు. మంగళవారం నగరపాలక కార్యాలయంలో కోడ్ ఆఫ్ కాండక్ట్ అమలుపై ఎంసీసీ, ఎంఎస్టీ, లా అండ్ ఆర్డర్, స్వీప్ అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఏసీపీ రామకృష్ణుడు, సీఎంఎం గోపి, ఆర్వో వర్మ, మేనేజర్ ఉమామహేశ్వర్‌రెడ్డి, స్వీప్ నోడల్ అధికారి చిన్నయ్య, ఇతర అధికారులు పాల్గొన్నారు.

అదుపుతప్పి లారీ బోల్తా



బంగారుపాళ్యం, మార్చి 26: చెన్నై - బెంగళూరు జాతీయ రహదారిలోని మొగిలి వద్ద గల జీకే కల్యాణ మండపం సమీపంలో లారీ అదుపు తప్పి బోల్తాపడిన సంఘటన సోమవారం రాత్రి చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. పలమనేరు వైపు నుంచి సున్నపు రాళ్ల లోడుతో వెళ్తున్న కంటైనర్ బోల్తా పడింది. దానివెనుకనే చింతపొట్టుతో పలమనేరు నుంచి తిరుపతి వెళ్తున్న మినీ లారీ బోల్తా పడింది. మినీ లారీని మరో లారీ ఢీకొని బోల్తాపడింది. ఎవరికీ ఎలాంటి గాయం కాకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు. అదుపుతప్పి బోల్తాపడిన లారీలు పూర్తిగా దెబ్బతిన్నాయి.

సీ-విజిల్ ఫిర్యాదుపై ఏఆర్వో విచారణ


ఫిర్యాదుపై పరిశీలన చేస్తున్న ఏఆర్వో అరుణ

చిత్తూరు, మార్చి 26: సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా ఎన్నికల ప్రవర్తనా నియమావళికి సంబంధించి సీ-విజిల్ ద్వారా అందిన ఫిర్యాదుపై ఏఆర్వో, కమిషనర్ అరుణ క్షేత్రస్థాయి విచారణ చేశారు. మంగళవారం ఎస్‌బీఐ కాలనీ మొదటి వీధిలో టీడీపీ నాయకుడు ప్రసాదరావు కార్యాలయం వద్ద అనుమతులు లేకుండా హోర్డింగ్ పెట్టారని ఫిర్యాదు అందింది. ఈ ఫిర్యాదుపై సంబంధిత అధికారులతో కలిసి కమిషనర్ తనిఖీ చేశారు. కార్యాలయం వద్ద హోర్డింగ్స్, సౌండ్ వాహనాలు తదితర వాటికి సంబంధించి తీసుకున్న అనుమతుల గురించి పరిశీలించారు. అన్నింటికి సరైన అనుమతులు తీసుకున్నట్లు గుర్తించి రిటర్నిగ్ అధికారికి నివేదికలు ఇచ్చారు. సీ-విజిల్ ద్వారా ఇప్పటి వరకు 19 ఫిర్యాదులు అందాయని, వాటిపై సంబంధిత అధికారులు 15 నిమిషాల్లో విచారించి రిటర్నింగ్ అధికారికి నివేదికలు ఇస్తున్నట్లు కమిషనర్ తెలిపారు. ఎంసీసీ, ఎఫ్ఎస్టీ సభ్యులు గోపి, రామకృష్ణుడు, గోపాలకృష్ణవర్మ తదితరులు పాల్గొన్నారు.